

రేపు పాడేరులో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి -పాడేరు : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15న శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్ మేళాలో లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, జిఎంఆర్ రక్షా సెక్యూరిటీ, అపోలో ఫార్మసీ, కేర్ ఫర్ యు, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మోహన్ స్పిన్టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పై ఎస్ కె ఇన్ఫోటెక్, ఈకాం ఎక్స్‌ప్రెస్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి ప్రముఖ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొంటున్నాయన్నారు. రూ.పది వేల నుండి రూ.15వేల వరకు నెలసరి జీతం ఉంటుందని,.10వ తరగతి నుండి పిజీ వరకు, ఐటిఐ నుండి డిప్లొమో, ఇంజనీరింగ్ చదువుకున్న యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 04017 86463, 9308338105 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో డిఎస్‌డిఒ జి.ప్రశాంత్, నవీన్ పాల్గొన్నారు.

రెండో రోజుకు అంగన్వాడీల సమ్మె

పలు పార్టీలు, సంఘాల సంఘీభావం ... పలుచోట్ల వంటావార్పు నిరసన .. ముఖ్యమంత్రి హామీల అమలుకు డిమాండ్



అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర

తమ డిమాండ్ల సాధన కోసం సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడీ యూనియన్ల పిలుపు మేరకు అంగన్వాడీలు సమ్మె చేపట్టిన సమ్మె బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐసిడిఎస్, రెవెన్యూ, ఐటిడిఎ కార్యాలయాల వద్ద నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసనలకు టిడిపి, సిపిఎం, సిపిఐ, ప్రజా పంథా తదితర పార్టీలు, సిఐటియు, గిరిజన సంఘం, యుటిఎఫ్ వంటి సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు.

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం



రంపచోడవరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, తెలంగాణ కంటే అదనపు వేతనం, గ్రాట్యూటీ చెల్లింపు, ఇతర సౌకర్యాలను కల్పిస్తామన్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డ హామీలను వెంటనే అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర డిమాండ్ చేశారు. అరకువేలి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీల రెండో రోజు సమ్మెలో భాగంగా చేపట్టిన వంటావార్పు నిరసనలో పాల్గొని, సంఘీభావం ప్రకటించారు. కనీస వేతనం రూ.26వేలు అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్,వేతనంలో సగం చెల్లింపు, బీమా అమలు, చనిపోయిన అంగన్వాడీల స్థానే వారి కుటుంబీలకు ఉద్యోగం కల్పన వంటి సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే వైసిపికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జె భగత్ రామ్, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి నాగమ్మ,ప్రాజెక్టు కమిటీ నాయకులుపాంగి వెంకటలక్ష్మి, లక్ష్మి, నిర్మల, జానకి, భవాని, సీత, గౌరమ్మ, వంజన పాల్గొన్నారు.

పాడేరు: తమ సమస్యల్ని పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు చేపట్టిన సమ్మె బుధవారం రెండవ రోజు కొనసాగింది. పాడేరు ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట శిబిరంలో 300 మంది అంగన్వాడీలు నిరసన దీక్ష చేపట్టారు. అంగన్వాడీల యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కే భాగ్యలక్ష్మి ,విజయ చిన్నారి దేవి లక్ష్మి కుమారి ఇంద్ర పాల్గొన్నారు.

పెదబయలు : అంగన్వాడీల సమ్మెలో భాగంగా బుధవారం రెండోరోజున స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద యూనియన్ అధ్యక్షురాలు టి రాజమ్మ ఆధ్వర్యంలో మండుటెండలను సైతం లెక్కచేయకుండా చంటి పిల్లలను చెంకలో పెట్టుకొని సుమారు 400 మంది అంగన్వాడీలు నిరసన చేపట్టారు. వీరికి ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు సంపూర్ణమద్దతు ప్రకటించాయి. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడాల్ మాట్లాడుతూ, మాటిచ్చి అంగన్వాడీలను సిఎం జగన్ మోసపుచ్చడం సరికాదని, వెంటనే వారిన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మధ్యాహ్నం నడిరోడ్డుపై వంటవార్పు నిర్వహించారు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి కౌసల్య, సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేత కె శరబన్న అంగన్వాడీ నేతలు సిహెచ్.పద్మ, లొట్టి మంగ, సుశీల, రూప పాల్గొన్నారు

ముంచింగిపుట్టు: ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీల రెండవ రోజు నిరవధిక సమ్మెను సిఐటియు ఆధ్వర్యంలో దిగ్విజయంగా కొనసాగించారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్, గిరిజన మహిళా సంఘం మండల కార్యదర్శి ఎస్.ఈశ్వరి, విఆర్ఎల సంఘం నేత పరుశురాం సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల యూనియన్ మండల గౌరవ అధ్యక్షురాలు బి.సత్యవతి. పార్వతి, సుజాత, మౌలమ్మ, కాంతమ్మ, ఎస్.చిలకమ్మ, మొంగ్లి, భవాని, సుమిత్ర ఆదివాసీ గిరిజన మహిళ సంఘం నాయకులు రాధమ్మ, మీనా పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన ఉధృతం చేస్తామని అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమ్మ హెచ్చరించారు. బుధవారం రెండోరోజున అంగన్వాడీలు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. సంఘం మండల అధ్యక్షురాలు కే కొండమ్మ, కార్యదర్శి సత్యవతి, జి పవిత్ర పాల్గొన్నారు.



అరుకులో అంగన్వాడీల వంటావార్పు నిరసన

అనంతగిరి :అంగన్వాడీల రెండోరోజు సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.దేవుడు, మండల అధ్యక్షులు వివి ఈశ్వరరావు. మండల ప్రతినిధులు, జయ కుమార్, ఎస్ బంగారాజు సంఘీభావం తెలిపారు సమ్మెలో అంగన్వాడి మండల ప్రతినిధులు కళావతి, మంజుల, చిలకమ్మ, అరుణ పాల్గొన్నారు

జి.మాడుగుల: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా, వారి వద్ద నున్న కేంద్రాల తాళాలను గ్రామ వాలంటీర్లు, పోలీసులతో బలవంతంగా లాక్కోవాలని చూడడం దుర్మార్గమని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మండిపడ్డారు. అంగన్వాడీల రెండో రోజు సమ్మె శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు. గిడ్డి మోదకొండమ్మ, మాతే వరహాలమ్మ, ఎస్.రాజేశ్వరి, వనబంగి పూర్ణిమ, మత్స్యరాస వెంకటలక్ష్మి, పి వరలక్ష్మి, కాంతమ్మ, మత్స్యరాస వెంకటలక్ష్మి, పి వరలక్ష్మి, కాంతమ్మ, విద్య పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీల రెండోరోజు సమ్మె దీక్ష శిబిరంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు టి. కృష్ణారావు, పి.మూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అప్పలకొండమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు

ఎటపాక : సిఐటియు అనుబంధ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎటపాక ప్రాజెక్టులో అంగనవాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మావతి, జిల్లా కమిటీ సభ్యురాలు సోయం వీరమ్మ, మండల కమిటీ సభ్యురాలు అపక సమ్మక్క, తోటపల్లి ఉప సర్పంచ్ నాగమణి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విఆర్.పురం : అంగన్వాడీలు చేపట్టిన దీక్షలు రెండో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు సిపిఎం, తెలుగుదేశం పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. దీక్షల్లో కూర్చున్న వారికి మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, సిఐటియు జిల్లా సహాయక కార్యదర్శి పూనెం సత్యనారాయణ, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, గుండెపూడి లక్ష్మణరావు తదతరులు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. యుటిఎఫ్ నాయకులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు సున్నం నాగమ్మ, మండల కార్యదర్శి రాజేశ్వరి, అధ్యక్షులు నాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళన బుధవారం రెండో రోజు కొనసాగింది. అంగన్వాడి వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయాల ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు మద్దతు తెలియజేసిన సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను చిన్న చూపు చూస్తూ వారి జీతాల పెంపు విషయంలో నిర్లక్ష్య ధోరణి వహిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వీకా రాజన్న దొర, మారేడుమిల్లి మండల అధ్యక్షురాలు రత్నకుమారి, కార్యదర్శి డి ప్రసున, వై రామవరం మండలం అప్పర్ పార్ట్ అంగన్వాడి, మినీ అంగన్వాడి వర్కర్స్, ఆయాలు పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీల రెండో ఆందోళన కార్యక్రమాన్ని యూనియన్ అధ్యక్షులు సవలం వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆందోళనకు ప్రజా పంథా జిల్లా నాయకులు కె.కల్పన, ఆదివాసి నాయకులు సున్నం వెంకటరమణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సెక్టర్ లీడర్లు జయ, కామేశ్వరి, దుర్గ, పార్వతి, కిట్టమ్మ, సత్యవతి, విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలో బుధవారం ఆందోళన కొనసాగింది. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు కారం రామలక్ష్మి, మంగమ్మ, చిట్టెమ్మలు, సింగారమ్మ, సత్యవేణి, అధికసంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : అంగన్వాడీల నిరసన దీక్షకు ఆదివాసి జేఏసీ మండల కన్వీనర్ వంతు బాలకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు తదితరులు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి నిర్మల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, యూనియన్ మండల కార్యదర్శి కె వెంకటలక్ష్మి, నాయకులు యు రాజేశ్వరి, ఎల్ సత్యవతి, కె లక్ష్మీ, ఎం చిన్నమ్మలు, రమణి, సుందరమ్మ పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

కూనవరం : కూనవరం బస్టాండ్ సెంటర్లో చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజుకి చేరింది. వీరి ఆందోళనకు ఆశా కార్యకర్తలు మద్దతు తెలిపారు. యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి అన్నపూర్ణ, అధ్యక్షులు పద్దం లక్ష్మి ప్రసన్న, అర్జమ్మ, లలిత, సీఐటీయూ నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీలేరు : జికె.వీధిలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి మొక్కల మహేష్ బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని వివిధ అంగన్వాడీ సెంటర్ల తాళాలు గ్రామ వాలంటీర్లు, మహిళా పోలీసుల చేత బలవంతంగా లాక్కునే ప్రయత్నాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్.సత్యవతి ఎల్.అప్పల నరసింహ, జ్యోతి, భవాని, మేరీ, యశోద, కుమారి తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరు : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, బుధవారం కొయ్యూరు వచ్చిన పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు వై. అప్పలనాయుడు, గిరిజన సంఘం నాయకులు ఎస్ సూరిబాబు, యూనియన్ నాయకులు అచ్చమ్మ, ముత్యాలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్



అనంతగిరిలో సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న యుటిఎఫ్ నేత దేవుడు



పెదబయలులో అంగన్వాడీల నిరసన



కొయ్యూరులో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంలో ధాన్యం కొలుగోల కేంద్రాన్ని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించే ప్రతి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని చెప్పారు. గతంలో కొయ్యూరు మండలంలో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మూడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దళారీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి రైతులు అత్యుత్తమ ఉత్పత్తులను సాధించే దిశగా వారికి మేలైన విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందించి, రైతుల నుండి వారి ఉత్పత్తులను కొనుగోలుకు ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నత్తరు శోభన్ బాబు, ఎంపీపీ బడుగు రమేష్, జడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అంబటి నూకలమ్మ, అప్పన్న వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ జైతి రాజులమ్మ, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ బండి సుధాకర్, పిఎసిఎస్ చైర్మన్ సుమర్ల సూరిబాబు, వైస్ సర్పంచ్ కాళ్ళ వనం బాబు, సర్పంచులు శ్రీను, శేఖర్, సింహాచలం, ఎంపీటీసీలు మల్లేశ్వరి, బీడిజన అప్పారావు, వైసిపి నాయకులు రీమల గంగాధరం, సడ్డా సావిత్రి, గాడి అచ్చిరాజు, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్‌సిపిఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సతీష్ డిమాండ్ చేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు నేటికీ నష్టపరిహారం అందలేదని, దేవీపట్నం మండలంలో గ్రామాలు మొత్తం ఖాళీ చేయించారని, కానీ వాళ్లకు నివాసాలు ఏర్పాటు చేయలేదని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఐటిడిఏ పిఒ పూర్తిగా వైఫల్యం చెందారని, అధికారుల పనితీరు అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. రహదారులు లేక నేటికీ వైద్యం కోసం డోలీ మోతలు తప్పడం లేదని వాపోయారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జుత్తు కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, తుఫాను వల్ల నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపిఐ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ,మూర్తి జిల్లా నాయకులు కంగల్ అబ్బాయి దొర, బాబురావు, లలిత, బాల్ దొర తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌కు అవకాశం కల్పించాలని వినతి

ప్రజాశక్తి -సీలేరు

వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసి నిరుద్యోగులుగా ఉన్న యువతీ యువకులకు సీలేరు జల విద్యుత్ కేంద్రంలో అప్రెంటిస్ చేయడానికి అవకాశం కల్పించాలని ఏపీ జెన్కో ఈఈ లక్ష్మీనారాయణకు సిఐటియు నాయుకలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్ వి.విష్ణు కుమార్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా పరిధిలో నివసిస్తున్న లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఐటిఐ, డిప్లమా, బిటెక్, ఒకేషనల్ వంటి వివిధ వృత్తి విద్యా కోర్సులు చేసి అప్రెంటిస్ లేక ఉద్యోగాలు పొందలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. వత్తి విద్య కోర్సులు చేసిన నిరుద్యోగులు ఉద్యోగం పొందాలంటే అప్రెంటిస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పేద అభ్యర్థులు మైదాన ప్రాంతంలో అప్రెంటిస్ చేసే ఆర్థిక స్థోమత, అవగాహన లేకపోవడంతో అప్రెంటిస్ చేయలేని దుస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. అటువంటి వారందరినీ సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఏపీ జెన్కో అధికారులు అప్రెంటీస్ కల్పిస్తే యువకులు ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. సీలేఉ కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, మోతుగూడెం, డొంకరాయి, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాలు ప్రారంభించి నేటికీ 55 సంవత్సరాలు గడుస్తున్నా, జల విద్యుత్ కేంద్రాల్లో ఇంతవరకు టెక్నికల్ కోర్సులు చేసిన విద్యార్థులకు ఎటువంటి అప్రెంటిస్ కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఏపీ జెన్కో అధికారులు స్పందించి జలవిద్యుత్ కేంద్రాల్లో అప్రెంటిస్‌కి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు.



ఎపి జెన్‌కో ఇఇ లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు, నిరుద్యోగులు

బలిమెల రిజర్వాయర్ నీటి నిల్వలపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వలపై ఆయా రాష్ట్రాల అధికారులు జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కోకో అతిథి గృహంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023- 24 నీటి సంవత్సరం 2023 జూలై నుంచి ఇప్పటివరకు ఏ రాష్ట్రం ఎన్ని టీఎంసీలు నీటిని వినియోగించుకున్నదో లెక్కలు తేల్చారు. ఆంధ్ర 2022 -23 నీటి సంవత్సరంలో ఒరిస్సా కంటే అదనంగా వాడుకున్న 13.7578 టీఎంసీలతో కలిపి ఈ ఏడాది (2023- 24 నీటి సంవత్సరంలో) నవంబర్ 30 నాటికి 33.4957 నీటిని వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. ఒరిస్సా ఇప్పటి వరకు 31.3932 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. ఆంధ్ర, ఒడిస్సా కంటే ఇప్పటివరకు 2.1025 టీఎంసీలు నీటిని అదనంగా వినియోగించుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపూట్ జలాశయాల్లో 64.1397 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నట్లు తేల్చారు. ఇందులో ఆంధ్ర వాటాగా 31.0186 టిఎంసిలు, ఒరిస్సా వాటా 33.1211 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ఇరు రాష్ట్రాల గ్రిడ్ డిమాండు, ఇరిగేషన్ అవసరాలు నిమిత్తం ఆంధ్రాకు 2500 క్యూసెక్కుల నీటిని, ఒరిస్సాకు 1500 క్యూసెక్కుల నీటిని బలిమిలా జలాశయం నుంచి విడుదల చేయడానికి ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య అంగీకారం కుదురింది. ఈ కార్యక్రమంలో ఒడిస్సా తరపున పొట్టేలు ఇరిగేషన్ చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ (సివిల్) పితబాస్ శెట్టి, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఈ రమాకాంత్ పాత్రో, ఏఈలు తుసార్ రాజన్ కుంత, గడదర్ ప్రధాన్, ఒరిస్సా హైడల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయిదాస్, సీలేరు ఏపీ జెన్కో ఎస్ఈ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఈఈ జి.ప్రభాకర్, ఏడీఈ అప్పలనాయుడు, ఏఈ సిహెచ్. సురేష్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అధికారులు



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

20వేల ఓట్లు మార్పులు, చేర్పులు

- సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గంలో సుమారు 20 వేల ఓట్లను మార్పులు చేర్పులు చేయడం జరిగిందని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. తన ఛాంబర్‌లో బుధవారం సబ్ కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల సవరణ ఓటర్ల మార్పులు చేర్పులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుండి 12వ తేదీ వరకు ఫారం-6కు 1962, ఫారం-7కు 948, ఫారం-8కు 755 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,74,293 ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఏజెన్సీలో డోర్ నెంబర్ లేని వాటిని చాలావరకు పరిష్కరించామన్నారు. ఓటర్ల జాబితాలో డబల్ ఎంట్రీ ఉన్న వాటిని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి సంబంధిత ఓటర్ దారునికి నోటీసులు అందజేసి ఒక ఓటును తొలగించే విధంగా తగు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి బిఎల్ఓ పరిధిలో ఓటర్లకు సంబంధించిన మార్పులు చేర్పులు, చనిపోయిన ఓటర్లను తొలగించడం తదితరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తారన్నారు. ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పెంటపాటి అనంత మోహన్, సిద్ధ వెంకన్న బాబు, టి.బాబురావు దొర, పి.శ్రీనివాసరావు, యం.వాణిశ్రీ, డిప్యూటీ తహశీల్దారు యంవివి సత్యనారాయణ, డి.ఇందిరా బాయ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజమండ్రి సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎమ్‌డి యూసఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక పథకాలు అమలు చేసారు. 25.76 లక్షల యల్.ఈ.డి బల్బులు పంపిణీ, 2973 ఎనర్జీ ఎఫిషియెంట్ మోటార్స్ రైతులకు ఉచితంగా ఏర్పాటు, యల్.ఈ.డి వీధి దీపాలు పెట్టడానికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పన వంటి కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. రైతులకు 3940 సోలార్ వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. అందరూ తప్పని సరిగా విద్యుత్ పొదుపును పాటించాలని, స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలు వినియోగించాలని, కోరారు.



ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

అంగన్వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని రంగశీల పంచాయతీ బిటింగువలస గ్రామంలో 2018-19 ఎస్‌సిఎ నిధులు రూ.10లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని బుధవారం జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, ఎంపిపి కూడా రాజుబాబు ప్రారంభించారు. భవనం లేక వసతిలేమితో ఇబ్బందులు పడిన విద్యార్థులు, సిబ్బందికి సొంత భవనం ఎట్టకేలకు ప్రారంభించడంతో సమస్య తీరినట్లైనది ఐసిడిఎస్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిడిపిఒ సిహెచ్ బాలచంద్రమణి దేవి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ముత్యంగి విశ్వేశ్వరరావు, ఎంపిటిసిగంజాయి సునీల, సర్పంచ్ తాంగుల ముత్యాలమ్మ, లైగండ సర్పంచ్ త్రినాథ్, సూపర్ వైజర్లు హైమావతి దేవి, దాడి అప్పలనర్సమ్మ, వీరన్న, వైసిపి నేతలు మోహనదాస్, దామోదరం పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా కేంద్రంలోని లోచలిపుట్టు వీధిలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 430 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక్కో రగ్గు పంపిణీ చేశారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ప్రసాదరావు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాడేరులో స్పందన

ప్రజాశక్తి -పాడేరు: ఈనెల 14న, గురువారం పాడేరు ఐటిడిఏ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత శుక్రవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఎన్నికల రోల్ అబ్జర్వర్ జె. శ్యామల రావు జిల్లా పర్యటనలో భాగంగా స్పందన వాయిదా పడిన స్పందనను 14న గురువారం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10గంటల నుంచి స్పందనలో కలెక్టర్‌తోపాటు అధికారులంతా అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో అందించి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

గాజువాకలో 'సౌత్ షాపింగ్ మాల్' ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక: కొత్త గాజువాకలో సౌత్ షాపింగ్ మాల్‌ను సినీ నటి సురభి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురభి మాట్లాడుతూ, నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందజేస్తూ వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొనాలని సూచించారు. ఈ షాపింగ్ మాల్ మరెన్నో బ్రాంచ్‌లతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విశాఖపట్నం అంటే తనకెంతో ఇష్టమని, ఈ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. రాబోయే పండగ సీజన్‌లో వినియోగదారుల మనస్సును దోచే విస్తృత కలెక్షన్లతో ముందుకు రావాలన్నారు.

పంట నష్టం అంచనాల్లో అలసత్వం!

వరిచేను కుప్పల్లో మొలకెత్తిన ధాన్యం
కుళ్లిన పైర్లు చూసి రైతన్నల లబోదిబో
నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి -హుకుంపేట : మిచౌంగ్ తుఫాను ప్రభావంతో వరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం మండలంలోని పట్టాం పంచాయతీ బూరువలస గ్రామ రైతులు తమ వరికుప్పలను విడదీయగా, చేనులోని ధాన్యం మొత్తం మొలకలెత్తడంతో ఆవేదన చెందుతున్నారు. తుపాన్ వెలిసిపోయి వారం రోజులు గడచినా అధికారులెవరూ పంటనష్టాలు అంచనా వేయడానికి రాలేదని, వారు వచ్చి చూస్తారని ఇన్నాళ్లు ఎదురుచూసి, తీరా కుప్పలను విడదీసేసరికి ధాన్యం మొత్తం మొలకలెత్తి, చేను కుళ్లిపోయి ఎందుకు పనికిరాకుండా పోయిందని కన్నీరుమున్నీరుగా విల్పఇస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు తమకు జరిగిన పంటనష్టాలను పరిశీలించి, సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి నివేదించి, తమకు పరిహారం వచ్చేలా చర్యలు చేపట్టి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. రైతులు కొర్రా నూకరాజు,కొర్రా. సుబ్బారావు, బూరు.చిన్నయ్య, బూరు. సునీల్ ఉన్నారు.



మొలకెత్తిన వరి చేనును చూపిస్తున్న రైతులు



పూర్తిగా మొలకెత్తిన కుప్పల్లోని ధాన్యం

జిఒ3పై ముఖ్యమంత్రి మౌనం వీడాలి

2024 జాబ్ కేలండర్ ప్రకటించాలి
అరకొర కాకుండా అన్ని పోస్టులూ భర్తీ చేయాలి
సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: జిఒ3పై ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మౌనం సరికాదని, 2024 జాబ్ కేలెండర్ వెంటనే ప్రకటించాలని, సిపిఎం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో స్థానిక నిరుద్యోగులకు వందశాతం ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేసిన వ్యవహారంపై ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం గిరిజన యువతను మోసగించడమేనన్నారు. బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలకు ఎస్‌టి రిజర్వేషన్‌కల్పిస్తూ ప్రభుత్వం జిఒ జారీచేయడం, జిఒ 3రద్దుపై తగురీతిలో ప్రభుత్వం స్పందించకపోవడం వంటి వ్యవహారాల్లో ముఖ్యమంత్రి మిన్నకున్నట్లే, గిరిజన ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడంపై ముమ్ముందు తగు మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.
రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7న 897 గ్రూప్-2 పోస్టులకు, 8న 81గ్రూప్-1 పోస్టులకు నామమాత్రంగా నోటిఫికేషన్‌ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని, అన్ని పోస్టులను ప్రకటించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాలున్నరేళ్లుగా గ్రూప్స్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూసిన లక్షలాది మంది నిరుద్యోగులకు నిరాశ కల్పించేలా ప్రభుత్వ ప్రకటన ఉందన్నారు. ఇప్పటికే పలువురి వయస్సు మీరిపోయిందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని సవరించాలని కోరారు
విద్యాహక్కు చట్టం ప్రకారం కేంద్రం ప్రకటించినట్లు 40వేల పోస్టులను పక్కనబెడితే, ప్రస్తుతం రాష్ట్రంలో 18వేలు టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వచ్చేఏడాదిలో మరో 12వేలమంది ఉద్యోగ విరమణ చేయనున్నారని, ఆయా పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటిస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్లుగా పనిచేస్తున్న భాషా వాలంటీర్లను రెగ్యులరైజ్ చేసి, వారి వేతనాలను పెంచాలన్నారు. గతేడాది 411 ఎస్‌ఐ, 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, ఎస్‌ఐ పోస్టుల ఎంపికల్లో అవకతవకలు చోటుచేసుకున్న నేపథ్యంలో కోర్టు జోక్యంచేసుకోవాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు.ఇప్పటికైనారాష్ట్ర ప్రభుత్వం స్పందించి, జాబ్ కేలండర్ ప్రకటించి, ఫిబ్రవరిలోగా అన్ని పోస్టులు భర్తీ అయ్యేలా టైంటేబుల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్టడీ సర్కిల్స్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని అప్పలనర్స డిమాండ్ చేశారు.

ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంపు

ప్రజాశక్తి -ములగాడ : నేవల్ డాక్‌యార్డు సమీపంలోని సరత్ ఛటర్జీ, బోత్రా గొడన్స్ కార్మికులకు కూలి రేట్లు పెరిగినట్లు సరత్ ఛటర్జీ, బోత్రా గోడౌన్స్ సైడింగ్ వర్క్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు తెలిపారు. ముఠా కార్మికుల కూలి రేట్లు పెంపు కోసం గౌడౌన్స్ యాజమాన్యం, సిఐటియు మధ్య బుధవారం చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, రెండేళ్లకోసారి కార్మికులకు, యాజమాన్యానికి అగ్రిమెంట్ చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మేరకు చర్చలు జరిపి అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. కార్మికుల తరుపున యాజమాన్యానికి జగ్గునాయుడు అభినందనలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు వల్ల పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ నిత్యావసరధరలు పెరగడంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విశాఖ పోర్టు ప్రైవేటు పరం కావడంతో వేసల్స్ రాక గొడౌన్స్ కార్మికులకు పని సరిగా లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అగ్రిమెంట్ ద్వారా పట్టుబడికి 13 శాతం, లోడింగ్‌కు 11.5శాతం అన్నింటి పైనా కూలిరేట్లు పెంచడానికి గొడౌన్స్ యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఈ చర్చల్లో గొడౌన్స్ ప్రతినిధులు ఎస్.ఆలీఖాన్, బి.రవీంధ్ర, కాంట్రాక్టర్ శ్రీనివాసరావు, రవికుమార్, సిఐటియు తరుపున ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గెడ్డలో మునిగి విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : మండల కేంద్రం డుంబ్రిగుడలోని బొడబొడగెడ్డలో దిగి విద్యార్థి మృతి చెందిన విషాదకర సంఘటన బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలివి.
డుంబ్రిగుడ గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆరో తగరతి చదువుతున్న బురిడీ సంతోష్(12) బట్టలు ఉతుకుకోవడానికి స్నేహితులతో కలిసి గెడ్డకు వెళ్లాడు. బట్టలు ఉతికే క్రమంలో గెడ్డలో లోతు ప్రాంతంలో దిగి, ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందారు. బుధవారం ఉదయం శ్మశానవాటిక సమీపంలో బొడబొడ గెడ్డలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన స్థానికులు గెడ్డలో శవమై తేలిన బాలుడి మృతదేహాన్ని గుర్తించి పంచాయతీ సిబ్బందికి, పోలీసులకు సమాచారాన్ని అందించారు. పంచాయతీ సిబ్బంది, పోలీసులు గెడ్డలో తేలియాడి ఉన్న బాధిత విద్యార్థి మతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం తమకు న్యాయం చేయాలని విద్యార్థి మృతదేహంతో బాధిత కుటుంబీకులు పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. పోలీసులు, సంబంధితశాఖ అధికారులు, పాఠశాల యాజమాన్యం బాధిత విద్యార్థి కుటుంబీకులకు సర్దిచెప్పి పోలీసుల సాయంతో మృతదేహాన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబాన్ని అడుకోవాలి: సిపిఎం

గెడ్డలో మునిగి మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబీకులను పరామర్శించారు. తక్షణమే అధికారులు, ప్రభుత్వం స్పందించి బాధిత విద్యార్థి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి నష్టపరిహారం చెల్లించి అదుకోవాలని ఆయన కోరారు.

వైసిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అనూషాదేవి



ప్రజాశక్తి - చింతపల్లి : వైసిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చింతపల్లి ఎంపిపి కోరాబు అనూష దేవి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం పలు రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. ఇందులో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని నియమించిన అధిష్టానం, అల్లూరి జిల్లాకు సంబంధించి చింతపల్లి ఎంపిపి కోరాబు అనూష దేవికి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చోటు కల్పించారు. దీంతో మండలంలోని వైసిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అనూషాదేవిని అభినందిస్తున్నారు. కాగాతనను రాష్ట్రకార్యదర్శిగా నియమించిన సిఎం జగన్, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవీలకు అనుషాదేవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా కృషి చేసి న్యాయం చేస్తానన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ మురళి

చిత్తశుద్ధితో సేవలందించండి

ప్రజాశక్తి -అనంతగిరి : పాలనను ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో ఉద్యగులు చిత్తశుద్ధితో పనిచేయాలని రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ మురళి అన్నారు. బుధవారం ఎగువశోభ పంచాయతీ, కొత్తవలస బాలుర పాఠశాలలో సచివాలయ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొన్నారు. వివిధ సేవలపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. తోటి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

18న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి -సీలేరు : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక జేమ్స్ గార్డెన్‌లో సిఐటియు జిల్లా కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులంను పర్మినెంట్ చేయాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ తిప్పారెడ్డి, కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మీటరు రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని, మహిళా ఉద్యోగులకు ఏడాదిలో ఐదు ప్రత్యేక సెలవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 18న జరగబోవు ఆందోళన కార్యక్రమంలో జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, మేటర్ రీడర్లు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, విద్యుత్ స్టోర్ హమాలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఆరిఫ్, సుబ్రహ్మణ్యం, ఆసిఫ్, శ్యాం ప్రసాద్, విజయ్, సునీల్, అబ్దుల్, రమణారావు, రాము, భాస్కర్, శ్రీను, ఆలీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ అమలు తీరు పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎపి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.ప్రతాప్ రెడ్డి బుధవారం సందర్శించి మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం విద్య మీద అనేక లక్షలు రూపాయలు ఖర్చుపెడుతుందని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. రాన్న పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ శ్రీధర్, ఎంఈఓ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం సిహెచ్.బాబురావు పాల్గొన్నారు.

చింతవానిపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతవానిపాలెం గ్రామంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మనోజ్ఞ తెలిపారు. గ్రామంలో విరోచనాలు, జ్వరాలతో బాధపడుతున్న పలువురికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రపాలెం పిహెచ్సి సిబ్బంది, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : విద్యార్థినులు ఇప్పటి నుంచే బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కొయ్యూరు ఎస్సై రాజారావు అన్నారు. మండలంలోని రాజేంద్రపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సందర్శించిన ఎస్సై విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే ఇంటి వద్ద పెద్దలకు, తమకు తెలపాలని కోరారు.

మూడో రోజూ అదే జోరు

- పాయకరావుపేట నియోజకవర్గంలో పూర్తయిన లోకేష్ యాత్ర
- యలమంచిలిలో ప్రవేశం
- టిడిపి, జనసేన పోటాపోటీగా ఫ్లెక్సీలు
- ఎక్కడికక్కడ నాయకులు బల ప్రదర్శన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, ఎస్.రాయవరం, యలమంచిలి రూరల్ విలేకరులు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పాయకరావుపేట నియోజకవర్గంలో పూర్తిచేసుకొని యలమంచిలి నియోజకవర్గంలోకి బుధవారం సాయంత్రం ప్రవేశించింది. సోమవారం రాత్రి పాయకరావుపేట నియోజవర్గంలోకి ప్రవేశించిన ఈ యాత్ర మంగళవారం నక్కపల్లి, బుధవారం మధ్యాహ్నం వరకూ ఎస్.రాయవరం మండలంలో సాగింది. ఆయన బస చేసిన కృషి గోకులం నుంచి ప్రారంభించిన యాత్ర ఎస్.రాయవరం మండలంలోని కోనవానిపాలెం, తిమ్మాపురం అడ్డురోడ్, గోకులపాడు, పెనుగొల్లు జాతీయ రహదారి గుండా సాగింది. మూడో రోజూ అదే జోరు కనిపించింది. దారిలో కార్యకర్తలు, మహిళలు స్వాగతం మధ్య పాదయాత్ర జరిగింది. సామాజిక తరగతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించి ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బుధవారం 18.3 కిలోమీటర్లు ఆయన నడిచారు. మొత్తంగా యువగళం పాదయాత్ర 3059.6 కిలోమీటర్లకు చేరింది.

ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు, డిజిటల్ తెరలు

యలమంచిలి నియోజకవర్గం పులపర్తి, లక్కవరం, ములకలాపల్లి, పురుషోత్తమపురం, పోతిరెడ్డిపాలెం మీదుగా రేగుపాలెం వరకు లోకేష్ యాత్ర సాగింది. కొత్తూరు ఎస్‌వి కన్వెన్షన్ సెంటర్ వద్ద బస చేశారు. జాతీయ రహదారి నుంచి యలమంచిలి వచ్చే రహదారిలో ఇరువైపులా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. యలమంచిలి నియోజకవర్గ ప్రవేశం నుంచి దారిపొడవునా టిడిపి, జనసేన నాయకులు పోటాపోటీగా వీటిని పెట్టారు. టిడిపి యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయకుమార్ భారీగా యవగళం ఫ్లెక్సీలు పెట్టారు. బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి ఫ్లెక్సీలు కూడా అత్యధికం ఉన్నాయి. అయ్యన్నపాత్రుడు తనయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఫ్లెక్సీలు కూడా పలుచోట్ల కనిపించాయి. యలమంచిలి రహదారి వద్ద డిజిటల్ తెరలు, భారీ స్క్రీన్‌లు ఏర్పాటుచేశారు.

యలమంచిలిలో ఘన స్వాగతం

యలమంచిలి నియోజకవర్గంలోకి ప్రవేశించిన లోకేష్‌కు టిడిపి యలమంచిలి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ అపూర్వ స్వాగతం పలికారు. భారీ గజమాలలు, డప్పులు, కోలాటం, బాణాసంచా మోతలతో ఆయనను స్వాగతించారు.

స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని వినతి

యలమంచిలి మండలంలోని మై హోమ్ సిమెంట్ కంపెనీ, సెజ్ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో వలస వెళుతున్నామని ములకలపల్లిలో నిరుద్యోగులు లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్దఎత్తున పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. యువతకు ఉద్యోగాలు వచ్చేవరకూ యువగళం నిధి కింద నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.

పోలీసులకు భవిష్యత్తు గ్యారెంటీ కార్డులు పంచిన లోకేష్

జగన్ తెచ్చిన జిఒ 79 రద్దు చేసి అలవెన్స్‌ను యథాతథంగా ఇస్తామని పోలీసులకు భవిష్యత్ గ్యారెంటీ కార్డులను లోకేష్ అందజేశారు. జగన్ పాలనలో పోలీసులకు సర్కారు పెట్టిన బకాయిలన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

లోకేష్‌ను కలిసిన నర్సీపట్నం న్యాయవాదులు

పురుషోత్తమపురంలో నర్సీపట్నం బార్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌ను కలిశారు. పేద, బలహీనవర్గాల ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం అమలులోకి తెచ్చిందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమైనదని లోకేష్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

రెండో రోజుకు గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-ఎటపాక

గ్రామీణ తపాలా ఉద్యోగుల దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా ఎటపాక మండలంలో ఉద్యోగులు రెండో రోజు సమ్మెను కొనసాగించారు. దీంతో మండలంలోని తపాల సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని పోస్టల్ ఉద్యోగులు తెలిపారు. నెల్లిపాకలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం వద్ద గంపల హరనాథ్, శ్రీనివాస్, వీరబాబు, షబ్బీర్, సాయిబాబు, అంజి బాబు, నాగయ్య, కుమారి, లక్ష్మయ్య, వెంకటేష్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కొయ్యూరులో తపాలా ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. దీంతో గ్రామాల్లో సేవలు నిలిచిపోయాయి. తమకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, పనిభారం తగ్గించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలపై కొయ్యూరులో సబ్ పోస్ట్ మాస్టర్ ధారకొండకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కిషోర్ బాబు, రాజారావు, నాగూర్, భాస్కరరావు, సత్యవతి పాల్గొన్నారు.



ఎటపాకలో నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎఎస్‌పి

పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-అడ్డతీగల : రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి అడ్డతీగల పోలీసు స్టేషన్‌ను బుధవారం సందర్శించి రికార్డులు, ఆయుధాల పనితీరును పరిశీలించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన పూర్తయిందని, ఎటువంటి సంఘటనలు జరగ కుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రంగురాళ్ళు తవ్వకాలు, సారా, పేకాట, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎస్‌సి, జిడి పోలీస్ శాఖలో కానిస్టేబుల్ పోస్టులు పడ్డాయని, వాటికి ఫ్రీ కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల సిఐ రాంబాబు, ఎస్‌ఐ అప్పలరాజు, ఎఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిగా గుర్తించాలని వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఎనర్జీ అసిస్టెంట్లను, సెక్రటరీలను సచివాలయ సిబ్బందిగా గుర్తించాలని కోరుతూ బుధవారం ఎనర్జీ అసిస్టెంట్ యూనియన్ సభ్యులు స్థానిక ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో 16 కేటగిరీలకు చెందిన ఉద్యోగులలో ఒకరైన ఎనర్జీ అసిస్టెంట్, సెక్రటరీలను రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7329 మందికి పైబడి నియమించారని తెలిపారు. కాని తాము సచివాలయ పరిధిలో కాకుండా, విద్యుత్ ఉద్యోగుల వల్లే విధులను నిర్వహిస్తున్నామని చెప్పారు. తాము 24 గంటలపాటు విధులను నిర్వహిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై గాయపడినా, ప్రాణాలు కోల్పోయినా అటు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్‌గాని, ఇటు సచివాలయ వ్యవస్థ నుండి గాని నష్టపరిహారం చెల్లించడం, కారుణ్య నియామకాలను ఇవ్వడం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రొహిబిషన్ డిక్లరేషన్ జిఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా చేసి ఎస్‌ఆర్‌లు ఓపెన్ చేయాలని, సచివాలయ ఉద్యోగులు మాదిరిగానే 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, గ్రామ వార్డు సచివాలయ జాబ్ చార్ట్ అనుసరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని, ఎనర్జీ సెక్రటరీలను సచివాలయం గుర్తించాలని, సిఎల్, ఈఎల్‌లు అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారం జగదీష్, పండ అర్జున్, కలం కిషోర్ బాబు, మిర్తివాడ సూర్యకిరణ్ రెడ్డి, కారం రాజేష్ బాబు, కారం వెంకటేశ్వర్లు, కారం బాపన్న, మల్లేశ్వరరావు, రాయుడు రాజు, ఎన్ రవిబాబు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎ వన్ పరీక్షలను పరిశీలించిన ఏజెన్సీ డిఇఒ

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం గవర్నమెంట్ హైస్కూల్, ఆశ్రమ బాలుర పాఠశాలలో జరుగుతున్న ఎస్ఎ వన్ పరీక్షలను బుధవారం ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో వ్యాక్సిన్ వేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : గర్భిణులు, చిన్నారులకు సకాలంలో వ్యాక్సినేషన్ చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ సాధన సూచించారు. డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఆమె, వ్యాక్సిన్ భద్రపరిచే గదులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందజేస్తున్న టీకాల రికార్డులను పరిశీలించారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా తట్టు, నిమోనియా, పొంగు వ్యాధుల నుంచి కాపాడేందుకు టీకాలు వేస్తున్నామని చెప్పారు.